క్లుప్తంగా

16 నుంచి మండలస్థాయి పోటీలు

మిడ్జిల్: విద్యార్థులకు మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. 14–15 సంవత్సరాల లోపు విద్యార్థులకు మండలస్థాయిలో ఈ పోటీలు ఉంటాయని పీడీ పరశు రాములు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల పీఈటీలతో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. పీఈటీలు రాములు, సరోజ, జాన్‌ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి



కోయిల్‌కొండ: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే ధ్యేయంగా కార్యకర్తలు పని చేయాలని మండల అధ్యక్షుడు జి.రవీందర్ అన్నారు. శుక్రవారం బూర్గుపల్లి, కోత్లాబాద్, మల్లాపూర్ గ్రామాల్లో గ్రామ కమిటీలు నియమించారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, రవినాయక్, నరసింహారెడ్డి, మహేందర్ నాయక్, జగన్, నరేష్, ఎల్లప్ప, రఘునాథ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ నైపుణ్యాలపై శిక్షణ

జడ్చర్ల టౌన్: బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ, హిందీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించారు. హిందీ నైపుణ్యాలపై 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ తెలిపారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయ సేవదృక్పథంలో సాగేవారన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ యాదయ్య, హిందీ విభాగాధిపతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

మహమ్మదాబాద్: టీడీపీని బలోపేతం చేయాలని వచ్చే ఎన్నికల్లో పూర్వవైభవం తీసుకురావాలని ఉమ్మడి గండేడ్ మండల పార్టీ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పత్రికా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ అలవేలు అనురాధ పార్టీలో చేరినట్లు వివరించారు. మాజీ ఎంపీపీ కొమిరె లక్ష్మయ్య, సాంస్కృతిక రాష్ట్ర సభ్యుడు చెంద్రాస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వాలని నిరసన



హన్వాడ: మండలకేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని నిరసన చేపట్టారు. హామీ ఇప్పటి వరకు నెరవేర్చలేదని వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కిష్ట్యానాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఓబెదుల్లా కొత్వాల్, బెక్కరి అనిత, వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేష్, వసంత, బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కోయిల్‌కొండ: కనాయపల్లిలో శుక్రవారం రియాల్టీక్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఉచిత పరీక్షా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, సింగిల్‌విండో చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ సత్యమ్మ, జిల్లా రైతు సమితి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వినియోగించుకోవాలి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించనున్నట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్, తదితర కేసులు ఉన్నవారు వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 11.30గంటల లోపు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

రేషన్ బియ్యంపై ఆందోళన అవసరంలేదు

గండేడ్: రేషన్ బియ్యంపై ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆదిత్యగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్లాస్టిక్ తరహా బియ్యం వచ్చాయని, కల్తీ జరిగిందని పలువురు తెలపడంతో ప్రతికల్లో వార్తలు రావడంతో శుక్రవారం ఆయన స్పందించారు. ఈ మేరకు గండేడ్ రేషన్‌షాప్‌ను తనిఖీ చేశారు. ఫైబర్ ఎక్కువగా ఉండే బియ్యం అందులో ఉన్నాయని కల్తీ లేదని, కరోనా తర్వాత తెలంగాణా మొత్తంలో ఈ తరహా బియ్యం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఇది కాకుండా నాసిరకంగా ఉండడం వంటి సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని చర్యలు తీసుకుంటామని వివరించారు.

గుడిమల్కాపూర్ బీటీకి గ్రహణం

- కంకరవేసి వదిలేసిన వైనం
- ప్రమాదాలకు గురవుతున్నా ప్రయాణికులు
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



వర్షాలకు కోతకు గురైనరోడ్డు



ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ప్రమాదానికి గురైన విద్యార్థులు

హన్వాడ: మండలకేంద్రం నుంచి టంకర మీదుగా గుడిమల్కాపూర్ వరకు వేస్తున్న బీటీ రహదారి అర్థాంతరంగా నిలిచిపోయింది. ఏడాదిన్నర కావస్తున్న రోడ్డు పనులు ముందుకు కదలడం లేదు. దారి పొడువునా ఉన్న కల్వర్టుల నిర్మాణాలు సైతం పూర్తి అయ్యాయి. అదేవిధంగా కంకర సైతం వేసి బీటీ పరిచేందుకు సిద్ధం చేశారు. కానీ ఇంకా పూర్తిచేయడం లేదు. దీంతో టంకర, గుడిమల్కాపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పున్నాయి. పలు సందర్భాలు వాహనాలు అదుపుతప్పి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గాయాలపాలయ్యారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అక్కడక్కడా కోతకు గురైంది. విషయంపై ఆయా గ్రామాల ప్రజలు స్థానిక సర్పంచ్‌లు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించడంలేదు. ఇప్పటికైనా పనులు పూర్తిచేసి సౌకర్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

- ప్రధానమంత్రి గ్రామీణసడక్ యోజన కింద చేపట్టిన ఈ బీటీరోడ్డుకు ప్రభుత్వం రూ.3.9730 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ 2021 జూలై 20న ప్రారంభించారు. ఈ ఏడాది జనవరి 19 లోపు పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటికీ అలాగే వదిలేశారు.

ప్రమాదాలకు గురవుతున్నాం..

రోడ్డు పనులను కంకరవేసి నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. కంకర దారిపై వెళ్లడం నరకయాతనగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పడంతో మా పిల్లలకు గాయాలయ్యాయి. ఇలా నిత్యం ఎవరో ఒకరు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే పనులు పూర్తి చేయాలి.

– విజయ్‌కుమార్, గుడిమల్కాపూర్

త్వరలోనే పూర్తి చేయిస్తాం..

రహదారిపై నిత్యం రాకపోకలు చేసే వారు ప్రమాదాల బారిన పడుతున్న విషయాన్ని సర్పంచ్‌లు, ఇతరులు మా దృష్టికి తీసుకొచ్చారు. కాంట్రాక్టర్‌కు విషయం చెప్పాం, చేసిన పనులకు నిధులు రాలేదని కాంట్రాక్టర్ నిలిపివేశారు. పనులు సకాలంలో పూర్తిఅయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– సురేష్, పీఆర్ ఏఈ

బిల్లులు రాకపోవడంతోనే..

చేసిన పనులకు బిల్లులు రాక పనులు నిలిపివేయాల్సి వచ్చింది. దారి పొడువునా కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశాం. కంకర వేశాం. పైన బీటి వేయాల్సి ఉంది. నిధులు మంజూరు అయిన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

– శివానంద్‌స్వామి, కాంట్రాక్టర్

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు



బాలానగర్‌లో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: అర్బన్ మండలంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగార్జున తెలిపారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని శుక్రవారం సూచించారు. ఈ మేరకు కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక శిబిరాలు నిర్వహించే రోజుల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6, సవరణలు, మార్పులు, చేర్పులకు ఫారం–8, తొలగింపునకు ఫారం–7, ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉంటాయని అన్నారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిర్దావర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: ఓటు హక్కు వినియోగంపై తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం తమ కార్యాలయంలో అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

చిన్నచింతకుంట: తహసీల్దార్ కృష్ణయ్య బీఎల్‌ఓలకు ఓటర్ నమోదు ప్రక్రియకు సంబంధించిన కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు.

నవాబుపేట: తహసీల్దార్ మల్లికార్జున్‌రావు శుక్రవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుకు సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు.

ఘనంగా మృత్యుంజయుల పుట్టినరోజు వేడుకలు



ఆర్థికసాయం అందిస్తున్న ఆసుపత్రి వైద్యులు

మహమ్మదాబాద్: మూడేళ్ల క్రితం తండ్రి చేసిన విషప్రయోగం నుంచి బయటపడి మృత్యుంజయులుగా నిలిచిన క్షేత్ర, నక్షత్రలకు శుక్రవారం రవి చిన్నపిల్లల ఆస్పత్రి నిర్వాహకులు పుట్టినరోజు వేడుకలు చేశారు. అదేవిధంగా రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. దేశాయిపల్లికి కుంట కేశవులు, కృష్ణవేణిలకు మొదట కుమార్తె జన్మించింది. రెండో కాన్పులోనూ కోస్గి ప్రభుత్వాస్పత్రిలో కృష్ణవేణి ఇద్దరు ఆడపిల్లల (కవలలు)కు జన్మనిచ్చింది. కాగా భర్త కేశవులు ముగ్గురు ఆడపిల్లల భారం కష్టమని భావించి మద్యం మత్తులో కవలలపై విషప్రయోగం చేశాడు. విషయం గమనించిన ప్రభుత్వాసుపత్రి సిబ్బంది వారిని మహబూబ్‌నగర్ రవి చిన్నపిల్లల ఆస్పత్రికి పంపించారు. కుటుంబీకులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో చిన్నారులకు ఆస్పత్రి నిర్వాహకులే దాదాపు 6.50 లక్షలతో చికిత్స చేసి బతికించారు. ఈ క్రమంలోనే శుక్రవారం వేడుకలు నిర్వహించారు. వైద్యులు శేఖర్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



జడ్చర్లలో వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కోయిల్‌కొండ: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా రాష్ట్రశాఖ పిలుపు మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ భరత్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు రజిత, వసుందర, హేమలత, జ్యోతి, సునిత, పురేందర్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబునాయుడులు, నాయకులు పాల్గొన్నారు.

హన్వాడ: పెద్ద దర్పల్లి యూపీఎస్‌లో శుక్రవారం పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చిన్నచింతకుంట, ముచ్చింతల, అప్పంపల్లి తదితర గ్రామాల్లో నిరసన తెలిపారు. తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

రాజాపూర్: మండల పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు గోపీకాంత్, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు



బలీదుపల్లి స్టేజీ వద్ద దూరంగా ఉన్న బస్‌షెల్టర్

అడ్డాకుల: జాతీయ రహదారి పక్కన ప్రయాణీకుల కోసం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని పలు స్టేజీల వద్ద స్టేజీలకు దూరంగా వాటిని నిర్మించడంతో అవి వృథాగా మారుతున్నాయి. అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి స్టేజీ, శాఖాపూర్, మూసాపేట మండలంలోని వేముల స్టేజీ, మూసాపేట, పోలకంపల్లి స్టేజీల వద్ద బస్‌షెల్టర్లను నిర్మించినా ఉపయోగం లేకుండా పోయిందని పలువురు పేర్కొంటున్నారు. కందూర్ స్టేజీ వద్ద అడ్డాకుల వైపు బస్‌షెల్టర్ దూరంగా ఉందని వాపోతున్నారు. ఈ క్రమంలో ఆయా స్టేజీల వద్ద ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం ప్రధాన రోడ్డుపైనే నిలబడుతున్నారని చెబుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని పేర్కొంటున్నారు. మరోవైపు కాటవరం, గుడిబండ, చక్రాపూర్, గాజులపేట, పొన్నకల్ స్టేజీ వద్ద అడ్డాకుల వైపు బస్‌షెల్టర్లను నిర్మించకపోవడంతో ప్రయాణీలకు తిప్పలు తప్పడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో మేకలు మృతి

అడ్డాకుల: పొన్నకల్ శివారులో శుక్రవారం విద్యుత్ షాక్‌తో రెండుమేకలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బండారి బుడ్డ, గొల్ల జెల్లప్పలు తమ మేకలను ఓపల్ చెరువు వైపు శుక్రవారం మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్కడ కిందికి వేలాడుతున్న కరెంటు తీగలు తగిలి కాపరులకు చెందిన చెరో మేక అక్కడికక్కడే మృతి చెందాయి. తీగలు కనిపించకుండా ఉండటం ఉన్నందునే ఘటన జరిగిందని, చనిపోయిన మేకల విలువ రూ.25వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఇటీవలే ఓ రైతుకు చెందిన గేదె కూడా ఇక్కడే ఇదే తరహాలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

12న బృందగానం పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 12న జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎం సమావేశ మందిరంలో విద్యార్థులకు జాతీయ బృందగాన పోటీలు నిర్వహిస్తున్నట్లు బీవీపీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌చందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీవీపీ కార్యాలయంలో శుక్రవారం భారత్ వికాస్ పరిషత్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సభ్యులు జి.పాండురంగం, వీఎస్‌ఆర్‌కే. ప్రసాద్, ఎ.నారాయణరావు భూషణ్‌పాండే, నాగేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ వ్యవస్థాపక దినోత్సవం

జడ్చర్ల: ఎల్‌ఐసీ 67వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక కార్యాలయంలో అధికారులు, ఏజెంట్లు, తదితర సిబ్బంది ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ జగన్నాథం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐలు రమేష్‌బాబు, జములప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏబీఎం శైలేందర్, లియాఫీ నాయకులు రంగ బాను, లక్ష్మణ్, నళినికాంత్, శోభన్‌బాబు, లక్ష్మయ్య, మజార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 32 మంది బాధిత కుటుంబాలకు రూ.18.77 లక్షల విలువ జేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. అనంతరం మైత్రీనగర్ వద్ద చేపట్టిన బ్రిడ్జి విస్తరణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తిచేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

హన్వాడ: కొత్తపేటకి చెందిన తొట్ల సాయమ్మ, కొత్తగొల్ల చందుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ అరుణ్, సర్పంచ్ చెన్నమ్మ, ఉపసర్పంచ్ రాములు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

దేవరకద్ర: మండలకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలను అందించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, పల్లకీ సేవ, లలితా సహస్ర పారాయణం చేపట్టారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



హన్వాడ: కొత్తపేట చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం గ్రామపెద్దలు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి ఉత్సవాన్ని తిలకించారు. సర్పంచ్ చెన్నమ్మ, ఎంపీటీసీ అరుణ్, ఉపసర్పంచ్ రాములు, ఆలయ చైర్మన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అడ్డాకుల: చిన్నమునుగల్‌ఛేడ్ పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం ఆవరణలో శుక్రవారం వాసవీ క్లబ్ వ్యవస్థాపకులు చంద్రసేనగుప్త జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ సీనియర్ ఉపాధ్యక్షుడు విట్యాల రామేశ్వర్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వలకొండ చంద్రశేఖర్, కోశాధికారి రాంచంద్రయ్య, వనితా క్లబ్ కార్యదర్శి రాధిక, కోశాధికారి లావణ్య, రాము, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు హాజరైన జిల్లా ప్రజాప్రతినిధులు



జెడ్పీ నుంచి బయలుదేరుతున్న ప్రజాప్రతినిధులు

జెడ్పీసెంటర్(మహబూనగర్) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన భారత వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి తరలి వెళ్లారు. జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, జెడ్పీ సీఈఓ జ్యోతి, డిప్యూటీ సీఈఓ మొగులప్ప, జెడ్పీటీసీలు వెంకటేశ్వరమ్మ, కల్యాణి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, రవీందర్‌రెడ్డి, ఎంపీపీలు మాధవి, శశికళ సూపరింటెండెంట్లు శ్రీహరి, ఆనంద్ ఇతరసిబ్బంది ఉన్నారు.

'ఓట్లు బీసీలవి.. సీట్లు మరొకరికి'



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : ఉమ్మడి జిల్లాలో ఆయా రాజకీయ పార్టీలు 7 సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్ డిమాండ్‌చేశారు. శుక్రవారం టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓట్లు బీసీలవి..సీట్లు మరొకరికి అన్న ధోరణితో పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం సీట్లను కేటాయించాలని కోరారు. ఈ మేరకు అన్ని పార్టీలపై బీసీ సంఘం ఆధ్వర్యంలో ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన బీసీల సింహగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నరసింహ, వెంకటేశ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్రుడి మధ్యారాధన



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని పరిమళ గిరిపై వెలిసిన రాఘవేంద్రస్వామి మఠంలో 352వ ఆరాధన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యారాధన చేపట్టారు. ఉదయం సుప్రభాతసేవ, కనకాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన శనివారం ఉత్తరారాధన, మహారథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మేనేజర్ దివాన్‌జీ గురురాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని మఠంలో మధ్యారాధన చేపట్టారు. విష్ణుసహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ఆలయ పూజారులు బాలకృష్ణాచార్యులు, రాఘవేంద్రచార్యులు, సురేష్, శిరీష్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి



వాకర్‌లు, వాకింగ్ స్టిక్‌లతో వృద్ధుల, దివ్యాంగులు

నవాబుపేట: సీనియర్ సిటిజన్లకు సమాజంలో సముచిత గౌరవం ఇవ్వాలని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫోరం ఆధ్వర్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు వాకర్లు, వాకర్ స్టిక్‌లు అందించారు. ప్రధానంగా బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా చేయూత నివ్వాల్సిన అవసరం ఉందన్నారు. హెల్ప్‌ఏజ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా 450 మందికి వాకింగ్ స్టిక్‌లు, 124 మందికి వాకర్లను అందించినట్లు వివరించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు జగపతి రావు, నాగభూషణం, మండల అధ్యక్షుడు నర్సింహులు తదితరులు ఉన్నారు.

నకిలీ ధ్రువపత్రాలు పొందినవారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో మదాసీ, మదారి కురువల పేరిట బీసీ 'బీ' కులానికి చెందిన కొందరు నకిలీ ఎస్సీ ధ్రువపత్రాలు పొందారని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం కన్వీనర్ మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. వాటితో మెడిసిన్, ఐఐటీ బెంగుళూర్‌లో అడ్మిషన్లు పొంది విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో విచారణ చేస్తే ఎక్కువ మొత్తంలో హైదరాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయం నుంచి పొందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని వివరించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ముఖ్య నాయకుల సమావేశం మాట్లాడారు. ఎలాంటి విచారణ చేయకుండా ధ్రువపత్రాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నకిలీ పత్రాలు పొందిన వారిపై, జారీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న హైదరాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయ ముట్టడి ఉంటుందని, జిల్లాలోని దళితులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కోకన్వీనర్లు జి.గోపాల్, బ్యాగరి వెంకటస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి సేకరణ చేపట్టిన నాయకులు



రాయినోనికుంట తండాలో మట్టి సేకరిస్తున్న నాయకులు

మిడ్జిల్: మేరీ మిట్టి మేరా దేశ్‌లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో వీర జవాన్ల స్తూపం నిర్మాణం కోసం శుక్రవారం మండలపరిధిలోని రాయినోనికుంట తండాలో నాయకులు మట్టి సేకరించారు. గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు తిరుపతి, భాస్కర్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లి గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, సీజీ.శేఖర్, తిరుపతిరెడ్డి, గోవర్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూత్పూర్: హస్నాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, టౌన్ అధ్యక్షుడు రవీందర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: గుడిమల్కాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి పి. చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కార్యదర్శి కొండా బుచ్చిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: జమిస్తాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో మట్టిసేకరణ కొనసాగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలరాజు, ధర్మాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాలమూరు: బీజేపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పిల్లలమర్రి పురాతన శివాలయం ఆవరణలో మట్టి సేకరించారు. పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్, జిల్లా నేతలు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.